క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: దూబే కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ తెలిపారు. ఫీడర్ పరిధిలోని సురభికాలనీ, ఆదర్శనగర్, దూబే కాలనీల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

శాంతినగర్ ఫీడర్ పరిధిలో..

రాజీవ్ గృహకల్ప 11కెవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు .. పాపిరెడ్డి కాలనీ పార్టు, రాజీవ్ గృహకల్ప అపార్టుమెంట్స్‌లో సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. వెస్టన్ హిల్స్ 11 కె.వి. ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అడ్డగుట్ట, వెస్టన్ హిల్స్, ఐసిఐసిఐ బ్యాంక్ వెనుక పక్కన, అదే విధంగా 11కె.వి. శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీరాంనగర్, సాయి చరణ్ కాలనీ, తులసీనగర్ కమ్యూనిటీ హాలు వెనుక ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయి ఐశ్వర్య లేఅవుట్, ఖాజాగూడ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఖాజాగూడ, గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్, హెచ్ఎండీఏ, హెజీసీఎల్, ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మియాపూర్: హెచ్ఎంటీ హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బృందావన్ కాలనీ, సంఘమిత్ర స్కూల్ బ్యాక్ సైడ్ ,సద్గురు కన్‌స్ట్రక్షన్స్, భవ్యాస్ నందనవనం ప్రాంతాలు, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జై భారత్‌నగర్, ఫర్టియాలీ బృందావన్ కాలనీ ఏరియా, నందమూరి ఫీడర్ పరిధిలో.. నందమూరినగర్, మెయిన్ రోడ్డు, హైదర్‌నగర్ విలేజ్, ముంబాయి హైవే రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

కూరగాయల ధరలు


శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 120-130, పచ్చిమిర్చి 100, బెండ 45, కాకర 60, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 45, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 60, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10, క్యాలీఫ్లవర్ (1) 30 సొరకాయ (కేజీ) 30, అల్లం 320, వెల్లుల్లి 220.

మురళీధర్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు



హఫీజ్‌పేట్: బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మధ్యప్రదేశ్ ఇంచార్జి మురళీధర్ రావు జన్మదినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబీసీ మోర్చా బోయిని మహేష్ యాదవ్ సోమవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి నిరిటి చంద్రమోహన్, ఆకుల మహేష్‌కుమార్, హఫీజ్‌పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి, తేజ ఉన్నారు.

ప్రొ.శివకుమార్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ శివకుమార్ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఫుల్‌బ్రైట్ నెహ్రూ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేటర్స్ సెమినార్ అవార్డుకు ఆయన ఎంపిక కావడం విశేషం. ప్రొఫెసర్ శివకుమార్ ఈ ఫెలోషిప్‌తో రెండు వారాల పాటు సెప్టెంబర్‌లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాను సందర్శిస్తారు. యూఎస్ క్యాంపస్‌లలో అలాగే భారతీయ ఉన్నత విద్యపై జ్ఞానాన్ని పంచుకోవడం, ఎంపిక చేసిన క్యాంపస్‌లు, సంస్థల సందర్శనలు, సమావేశాల సమయంలో పరిశోధన సహకారాలు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి, విదేశాలలో అధ్యయనం తదితర అంశాలను చర్చిస్తారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

చందానగర్, పాపిరెడ్డి కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన చెత్త



అండర్ పాస్ ఇలానా..?

వర్షాకాలం చెరువును తలపిస్తున్న అండర్‌బ్రిడ్జి

- చెత్తా చెదారం కలిసి దుర్వాసన
- రోజుల తరబడి రాకపోకలు బంద్
- వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం

హఫీజ్‌పేట్: వర్షం కురిస్తే చాలు.. చందానగర్ రైల్వేస్టేషన్ అండర్ పాస్ వర్షపునీటితో నిండిపోతోంది. చందానగర్ హుడాకాలనీ, పాపిరెడ్డి కాలనీల ప్రజ లు పనుల నిమిత్తం చందానగర్ రైల్వేస్టేషన్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. గతంలో పాపిరెడ్డి కాలనీ నుంచి చందానగర్ హుడా కాలనీకి వెళ్లాలంటే కనీసం 3 కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. దీంతో స్థానిక ప్రజల కోరిక మేరకు చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించారు. అయితే వరదనీరు వెళ్లేలా ప్రణాళిక లేకుండా నిర్మించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అండర్ పాస్ వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

- అండర్ పాస్ కింద వరద నీరు నిలవడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది
- స్థానికులు చెత్త చెదారంను బ్రిడ్జి వద్ద వేయడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి.దీనికితోడు వర్షపు నీటిలో కలిసి నీటి ప్రవాహంకు అడ్డుపడుతున్నాయి
- చందానగర్, గంగారం, మదీనాగూడవాసులు గచ్చిబౌలి వెళ్లాలంటే ఈ అండర్ పాస్ నుంచే వెళ్లాలి. కానీ వరద నీటి నిల్వతో నెలల తరబడి ఇబ్బందులుపడుతున్నారు.
- హుడా కాలనీ నుంచి బ్రిడ్జికి వచ్చే రోడ్డు పూర్తిగా కంకర తేలి గుంతలు పడ్డాయి.
- సూచిక బోర్డులు లేక అండర్‌పాస్ కింద ప్రమాదాలు జరుగుతున్నాయి.

శాశ్వత పరిష్కారం చూపాలి



చందానగర్, పాపిరెడ్డికాలనీ అండర్ బ్రిడ్జి వర్షాకాలం వరద నీటితో నిండిపోతోంది. చెత్త చెదారం చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అండర్ పాస్ వరద నీటి సమస్యకు ఉన్నతాధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

– వీరభద్ర, రాజీవ్‌గృహకల్ప, పాపిరెడ్డికాలనీ

సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి



పాపిరెడ్డికాలనీ అండర్ బ్రిడ్జి వద్ద సూచికబోర్డు లేకపోవడంతో ఎటువైపు ఏ వాహనం వస్తుందో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నాం. రాత్రి సమయాలలో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– బి.శేఖర్, పాపిరెడ్డి కాలనీ



మలుపు వద్ద సూచిక బోర్డులు లేని దృశ్యం



హుడా కాలనీ నుంచి అండర్ పాస్‌కు వెళ్ళే రోడ్డుపై కంకర తేలిన దృశ్యం

విద్యార్థులకు మంచి వాతావరణం, సౌకర్యాలు అవసరం

మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.ఐనుల్ హసన్



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్న వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అద్భుతమైన సామర్థ్యాలు ఉన్నాయని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. అమెరికాకు చెందిన సపోర్ట్ ఫర్ ఎడ్యుకేషనల్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ (సీడ్) ద్వారా రూ.73.9 లక్షల స్కాలర్‌షిప్‌లను వీసీ మంగళవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైస్‌చాన్స్‌లర్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి వాతావరణం, తగిన సౌకర్యాలు అవసరమని, తద్వారా వారు తమ సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చ న్నారు. స్కాలర్‌షిప్‌లను అందించే వారి లక్ష్యాన్ని విద్యార్థులు సాధించాలని సూచించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో సీడ్ సంస్థ ఈ ఏడాది 586 మందికి స్కాలర్‌షిప్‌లు ఇచ్చారని తెలిపారు. 'సీడ్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ మజహరుద్దీన్ హుస్సేని మాట్లాడుతూ విద్యకు మొదటి, ఉపాధికి రెండవ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆత్మవిశ్వాసం, కృషి, చిత్తశుద్ధి, సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా కెరీర్‌ను మెరుగుపర్చుకోవడం, విద్యార్థుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ డైరెక్టర్ ముజ్తబాహసన్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం అధికారుల వివరాలు

హఫీజ్‌పేట్ డివిజన్ వార్డు కార్యాలయం : హనుమాన్ టెంపుల్

హోదా	అధికారి పేరు	ఫోన్ నంబర్
ఏఎంసీ	సి.నాగరాజు	9989930299
ఇంజనీరింగ్	ఎస్.ప్రతాప్	7331189194
శానిటేషన్	సురేష్	9703933383
టౌన్‌ప్లానింగ్	మధుకర్‌రెడ్డి	9652783554
యూబీడీ	అనిత	6305430526
యూసీడీ	డి.రుక్మిణి.సీసీ	9849485481
ఎంటమాలజీ	రాజేష్ బాబు	9000231779
ఎలక్ట్రికల్	రామ్మోహన్‌రావు	6309029543
	ఖలీల్	9848011810
వెటర్నరీ	డాక్టర్ అబ్దుల్ బాసిత్	8121041420
కంప్యూటర్ ఆపరేటర్	ఎన్.సౌజన్య	8500100015
టీఎస్‌పీడీసీఎల్	రాజేందర్, ఏఈ	9440813167
వాటర్‌వర్క్స్	యాదగిరి, మేనేజర్	912904280
హెల్త్	డా.శ్రీలేఖ	9640990444
	సునీత(హెచ్ఎస్)	9966850918

ఉచిత కంటి వైద్యపరీక్షలు

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి చందానగర్‌లోని ఆరంభ టౌన్‌షిప్‌లో అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరంభ టౌన్‌షిప్‌లో పారిశుధ్య కార్మికులకు సుమారు 400 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. మరో ఇద్దరికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తామని ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు. ఆరంభ టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షులు రవీంద్ర రాథోడ్, మధుసూదన్‌రెడ్డి, రామ భూపాల్‌రెడ్డి, రెహనా బేగం, రాజేష్, అమెరికన్ ఐ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికులకు మందులు అందజేస్తున్న దృశ్యం

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 8 మందికి కొవిడ్ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్టు నిర్వాహకుడు మనోహర్ తెలిపారు.

కుడికుంట సుందరీకరణ పనులు ప్రారంభం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: కుడికుంట చెరువును శోభితవర్ణంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం మసీద్‌బండలో రూ.65 లక్షల అంచనా వ్యయంతో కుడికుంట సుందరీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుకట్ట పునరుద్ధరణ, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక కాలువ నిర్మాణం చేపడతామని చెప్పారు. చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ తదితర పనులు చేపడతారన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చింతకింది రవిందర్ గౌడ్, పద్మారావు, కృష్ణ యాదవ్, మల్లేష్ గౌడ్, కొడిచెర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

పటాన్‌చెరు: పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన రంగయ్య శెట్టి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే ద్వారా సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.90వేల ఎల్‌ఓసీ సోమవారం రంగయ్య శెట్టి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాండు, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

తెలుగు సాహిత్యానికి తీరనిలోటు

రాయదుర్గం: ప్రముఖ రచయిత, ఉద్యమకారుడు డాక్టర్ నాగప్పగారి సుందర్రాజు దళిత సాహిత్యానికి విశేష కృషి చేశారని, చిన్నవయస్సులోనే సుందర్రాజు చనిపోవడం తెలుగు సాహిత్యానికి తీరనిలోటని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు .నాగప్పగారి సుందర్రాజు వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం హెచ్‌సీయూ దళిత విద్యార్థి సంఘం (డీఎస్‌యూ) ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆచార్య భీమయ్య మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సుందర్రాజుకు విశేషమైన స్థానం ఉందన్నారు. ఆయన కథలు , సాహిత్యం వివిధ భాషల్లోకి అనువాదమయ్యాయన్నారు. దళిత విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ మాదిగల జీవితాలను ఆవిష్కరించిన రచయిత సుందర్రాజు అని అన్నారు. కార్యక్రమంలో డీఎస్‌యూ కన్వీనర్ కుమార్ రాజ, ప్రతినిధులు వెంకటాద్రి, కమలాకర్, రాణాప్రతాప్, చరణ్, సందీప్, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



డా.సుందర్రాజుకు నివాళులర్పిస్తున్న ఆచార్య వెంకటేశ్వరరావు, డీఎస్‌యూ నాయకులు

'రేవంత్‌రెడ్డిని విమర్శించడం తగదు'

పటాన్‌చెరు టౌన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విమర్శించడం తగదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డిపై చేస్తున్న విమర్శలను ఖండిస్తూ సోమవారం పట్టణంలో ఆ పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో సమైక్య పార్టీలకు ఊడిగం చేసిన వాళ్లు కొంతమంది కాంగ్రెస్ ద్వారా ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యేలు పదవులు పొంది నేడు కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. రైతాంగానికి, పరిశ్రమలకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం అని చెప్పుకునే బీఆర్ఎస్ నేతలతో చర్చకు రావాలని సవాలు విసిరారు. మంగళవారం ఉదయం 11గంటలకు పటాన్‌చెరు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లి విద్యుత్ పంపిణీపై అధికారులను కలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షుడు హనీఫ్, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు కుంచాల కిషన్, హమీత్ పాష, ఉమ్మర్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

మద్యం విక్రేతలపై కేసులు నమోదు

హఫీజ్‌పేట్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. బోనాల పండగ సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించగా ఇదే అదునుగా కొంతమంది పాపిరెడ్డి కాలనీలో ఆదివారం, సోమవారం బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఐదు బెల్ట్ షాపులపై దాడి చేశారు. మద్యం స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పాపిరెడ్డి కాలనీకి చెందిన వెంకటేష్, పార్వతి, అరుణ, బాణావతి ,థారీలపై కేసు నమోదు చేసినట్లు సీఐ పాలవెల్లి పేర్కొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీ సర్వ సభ్య సమావేశానికి సోమవారం డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత్‌నగర్ కాలనీలో నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్‌నగర్ కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కాలనీలో ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సభ్యులు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు డాక్టర్ బలరాం, ఉపాధ్యక్షుడు సీవి సోమేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరి రాంప్రసాద్, జాయింట్ సెక్రటరి కృష్ణారావు, కల్చర్ వీరభద్రరావు, ట్రెజరర్ ఆశీర్వాదం, ఆర్గనైజింగ్ సెక్రటరీ జానకిరాము, మాజీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డితో పాటు మాజీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బోనాలు.. ఫలహారం బండ్ల ఊరేగింపు

- పోతురాజుల విన్యాసాలు, కళాకారుల ప్రదర్శనలు
- తారానగర్‌లో బోనాల సందడి

శేరిలింగంపల్లి: బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులతో తారానగర్‌లో సందడి నెలకొంది. భక్తుల జయజయధ్వానాలు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల ప్రదర్శనలు,కోలాటం, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

- తుల్జాభవాని ఆలయం నుంచి తుల్జాభవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపు, ప్రదర్శన కోలాహలంగా తారానగర్ మార్కెట్ మీదుగా పోచమ్మ దేవాలయం వరకు సాగింది.
- అదేవిధంగా పోచమ్మ దేవాలయం నుంచి ఫిరంగి మల్లేష్‌గౌడ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో సాగిన ఫలహారం బండి ఊరేగింపు తుల్జా భవానీ దేవాలయం వరకు సాగింది.
- తుల్జాభవాని ఆలయం, పోచమ్మ అమ్మవార్లను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ దర్శించుకున్నారు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు.
- స్వాగత వేదికపై భక్తులు పెద్ద సంఖ్యలో చేరడంతో కూలింది. కానీ ఎవరికీ గాయాలు కూడా కాకపోవడం విశేషం.

ఖాజాగూడలో కట్టమైసమ్మ బోనాలు..

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో సోమవారం అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కట్టమైసమ్మ బోనాల ఉత్సవాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొ న్నారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అమ్మవారి పూజలో పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో..

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఆమెని టీస్ సెంటర్ వద్ద అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు బోనం ఎత్తుకొని అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్ళి బోనం సమర్పించారు.





హెచ్‌సీయూక్యాంపస్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో బోనాలు







తారానగర్ తుల్జాభవానీ ఆలయం నుంచి, అలాగే పోచమ్మ ఆలయం నుంచి ఫలహారం బండ్ల ఊరేగింపులో కళాకారుల ప్రదర్శనలు



ఖాజాగూడలో.. వేడుకల్లో పాల్గొన్న స్థానిక నాయకులు